క్లుప్తంగా

'బంగారు తీసుకుని ఇవ్వలేదు'

కదిరి టౌన్‌: బంగారు ఆభరణాలు ఇంట్లో చూపించి తీసుకొస్తానని చెప్పిన తమ బంధువు ఒకరు.. తిరిగివ్వకుండా తమనే బెదిరిస్తున్నాడని కదిరిలోని వాసవీనగర్‌కు చెందిన పూల కన్నయ్య బుధవారం పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న గాండ్లపెంట మండలం జీనులకుంటకు చెందిన దూరపు బంధువు అయిన రామ్మూర్తి తమ ఇంటికి వచ్చాడని, మా వద్ద ఉన్న నాలుగు బంగారు గాజులు, ఒక చైన్‌, ఒక ఉంగరం చూసి.. తన భార్యకు చూపించి తీసుకొస్తానని నమ్మ బలికాడని పేర్కొన్నారు. బంధువే కదా అని ఇచ్చి పంపితే తిరిగి ఇవ్వకుండా.. అడిగితే ×దిక్కున్నచోట చెప్పుకో.. ఎక్కువ మాట్లాడితే అంతు చూస్తా፣ అని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

టమాట ఆటో బోల్తా



బోల్తా పడిన ఆటో

తనకల్లు: టమాట లోడుతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కదిరి రూరల్‌ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మహమ్మద్‌ బుధవారం తన ఆటోలో టమాట లోడు చేసుకుని అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మార్కెట్‌కు బయలుదేరాడు. తనకల్లు సమీపంలో సాయిబాబా ఆలయం దగ్గరకు రాగానే రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో సడన్‌ బ్రేక్‌ వేయగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌ మహమ్మద్‌ తల, నుదుటిపై బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రున్ని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఏసీఎస్‌ అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్‌: గొల్లోల్లచెరువు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్‌) అధ్యక్షునిగా నాగూరి శ్రీనివాసరెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు సహకార శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

తనకల్లు: రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని వ్యవసాయాధికారి భారతి సూచించారు. చీకటిమానిపల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. వేరుశనగ పంట పూత దశలో ఎకరాకు 4 బస్తాల జిప్సం వాడడం వల్ల గింజలో నూనె శాతం పెరిగి మంచి దిగుబడి పొందవచ్చని తెలిపారు. వేరుశనగలో అంతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బీఎల్‌ఓల శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ వీవీఎస్‌శర్మ

కదిరి అర్బన్‌: ఆర్డీఓ కార్యాలయంలో వారం రోజులుగా జరుగుతున్న బూత్‌ లెవెల్‌ అధికారు(బీఎల్‌ఓ)ల శిక్షణ బుధవారంతో ముగిసింది. బూత్‌ లెవెల్‌ అధికారులకు వారి విధులపై శిక్షణ, ఓటరు నమోదు, ఓటరు జాబితా నవీకరణపై శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి ఆర్డీఓ వీవీఎస్‌ శర్మ, తహసీల్దార్‌ మురళీక్రిష్ణ, ఎలక్షన్‌ డిప్యూటీ తహసీల్దార్‌ ఈశ్వర్‌ప్రసాద్‌, డిప్యూటీ తహసీల్దార్‌ రవినాయక్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ విజయ్‌కుమార్‌ తదితరులు హాజరయ్యారు.

నేడు ఎండీ కార్యాలయం ముట్టడి

పుట్టపర్తి టౌన్‌: మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విజయవాడలోని ఎండీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు మున్సిపల్‌ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. మున్సిపల్‌ కార్యాలయం ఎదుట చేపట్టిన ఇంజినీరింగ్‌ కార్మికుల నిరసన నాలుగోరోజు బుధవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో గంగాద్రి, రమణ, రమేష్‌, వెంకటేష్‌, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా ఆంజనేయులు

ధర్మవరం: ఆంధ్రప్రదేశ్‌ వడ్డెర, వడియ రాజుల సంక్షేమ సంఘం అనుబంధ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా ధర్మవరానికి చెందిన దేరంగుల ఆంజనేయులును నియమించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కన్వీనర్‌గా నియమించిన ఆంధ్రప్రదేశ్‌ వడ్డెర వడియ రాజుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీరాణికి ధన్యవాదాలు తెలిపారు. వడ్డెర్ల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు.

చీనీ రైతుకు కన్నీరు

- ధరలు భారీగా పతనం
- పెట్టుబడులూ తిరిగిరాని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



ధర పడిపోవడంతో చీనీకాయలు కోయకుండా తోటలోనే వదిలేసిన దృశ్యం



కునుకుంట్లలో చీనీ కాయలను లోడు చేయడానికి గంపలకు ఎత్తుతున్న కూలీలు

తాడిమర్రి: ధరల పతనంతో చీనీ రైతుకు కన్నీరు మిగులుతోంది. అష్టకష్టాలు పడి పంటను కాపాడితే మార్కెట్లో గిట్టుబాటు ధర లభించలేదు. దీంతో పెట్టుబడులు సైతం తిరిగిరాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని వ్యవసాయ భూముల్లో ఎర్రమట్టి నేలలే అధికం. ఇక్కడ పండే చీనీ ఎంతో రుచికరంగా ఉంటోంది. మార్కెట్‌ సౌకర్యం కూడా బాగుండటంతో ఎక్కువ మంది రైతులు కొన్నేళ్లుగా ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. తాడిమర్రి మండలంలో 8,580, బత్తలపల్లి మండలంలో 5,170, ధర్మవరం మండలంలో 4,460, ముదిగుబ్బ మండలంలో 4,400 మొత్తం 22,610 ఎకరాల్లో చీనీ సాగైంది. అయితే గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో చీనీ చెట్లను కాపాడుకోవడానికి రైతులు అప్పులు చేసి మరీ 800 – 900 అడుగుల మేర బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదు. కళ్లెదుటే చెట్లు ఎండుముఖం పడుతుండటంతో తట్టుకోలేకపోయారు. ట్యాంకర్ల ద్వారా నీరు తీసుకొచ్చి చెట్లకు నీటిని అందించి కాపాడుకున్నారు.

ధరల ధమాల్‌తో కోలుకోలేని రైతులు

పంట కోతకు వచ్చే సరికి మార్కెట్లో ధరలు అమాంతం పడిపోయాయి. ఇటీవల ఒక వారం వరకు చీనీ కాయల ధర టన్ను రూ.20 వేల నుంచి రూ.21 వేలు పలికాయి. ప్రస్తుతం ధరలు మరింత తగ్గిపోయాయి. టన్ను రూ.8వేల కనిష్టస్థాయికి పడిపోయాయి. కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో కొందరు రైతులు కాయలను కోయకుండా తోటల్లోనే వదిలేశారు. గిట్టుబాటు ధర వచ్చే వరకు వేచి చూద్దామని అని అనుకుంటే చెట్లకు నీరు చాలక ఎండిపోయే ప్రమాదం పొంచి ఉందని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి చెట్లకు నీరందించడానికి బిల్లులు ఇవ్వాలని కోరుతున్నారు.

పదేళ్ల కనిష్టానికి ధరలు



గడిచిన ఐదారేళ్లు చీనీ రైతులకు ఇబ్బందులు లేకుండా సాగాయి. సమృద్ధిగా వర్షాలు, అధిక పంట దిగుబడులు, ఆశించిన మేర గిట్టుబాటు ధర ఉండేది. అయితే ఏడాదిగా రైతుల పరిస్థితి అధ్వాన స్థితికి చేరింది. ఓ పక్క వర్షాభావ పరిస్థితులు ఇబ్బందులు పెడుతుంటే.. మరో పక్క చీనీకాయలు టన్ను ధర రూ.8 వేలకు పడిపోయింది. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– యలక ద్వారకనాథ్‌రెడ్డి, కునుకుంట్ల, తాడిమర్రి

ప్రభుత్వం ఆదుకోవాలి



బోరు బావుల్లో నీటి మట్టం తగ్గింది. దీంతో చీనీ చెట్లను కాపాడుకోవడానికి ఇబ్బంది అవుతోంది. నాకున్న 350 చెట్లకు నీరు అందించడానికి ఒకటిన్నర లక్షల రూపాయలు ఖర్చు చేసి రెండు బోర్లు వేశాను. ఒక నెల వరకు చెట్లకు సరిపడు నీరు వచ్చింది. తర్వాత ఒక బోరు పూర్తిగా ఎండిపోగా, మరో బోరులో నీటి మట్టం తగ్గింది. దీంతో చెట్లకు నీరు చాలక రోజూ రెండు ట్యాంకర్ల నీటిని తోలిస్తున్నాను. ప్రభుత్వం నీటి ట్యాంకర్లకు అయ్యే బిల్లులు చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– చీమల పెద్దన్న, కునుకుంట్ల, తాడిమర్రి

ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు



టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి కేశవనాయక్‌

గాండ్లపెంట: మండలంలోని కమతంపల్లి, పత్రవాండ్లపల్లి, కత్తివారిపల్లి, చిన్నక్కగారిపల్లిలో ఆవులు, గేదేలకు ముద్దచర్మ వ్యాధి ముందస్తు నివారణలో భాగంగా బుధవారం టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి కేశవనాయక్‌ తెలిపారు. మొత్తం 450 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారితో పాటు పశుసంవర్ధక సహాయకులు మానస, గంగాధర్‌, సల్మా, జగదీష్‌, లక్ష్మీరెడ్డిలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



రాధారాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్‌: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని ఎంఈఓ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. పుట్టపర్తిలోని గోకులం పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు రాధారాణిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంఈఓ మాట్లాడుతూ రాధారాణి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పీవీ రమణారెడ్డి, కళ్యాణి, రామ్మోహన్‌రెడ్డి, ఇందిర, సునీత, సుజాత, సుధాకర, అనిత, చంద్రకళ, అనిత, శంకర్‌, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతుల నిర్మాణానికి భూమి పూజ



చెన్నేకొత్తపల్లి కేజీబీవీలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత భూమి పూజ చేశారు. రూ.1.60 కోట్ల ఎస్‌ఎస్‌ఏ నిధులతో ఈ అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఎంపీడీఓ

కదిరి అర్బన్‌: మొటుకుపల్లిలో బుధవారం స్వచ్ఛాంధ్ర సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను డీఎల్‌పీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ పోలప్ప పరిశీలించారు. ప్రజలంతా తడి – పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్త తీసుకెళ్లే వాహనం గ్రామానికి వస్తోందా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలకు విరాళం అందజేత

బత్తలపల్లి: ధర్మవరంలో జూలై 31 నుంచి రెండు రోజులపాటు నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలకు బత్తలపల్లి మండలంలో ప్రజల నుంచి సేకరించిన రూ.లక్ష విరాళాన్ని నాయకులు నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధుకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో చేనేత, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి, సీపీఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్‌, సహాయ కార్యదర్శులు ఓబిలేసు, వడ్డే సన్నపెద్దన్న, సత్యప్ప, రామకృష్ణ, నాగభూషణ, లక్ష్మీనారాయణ, ఓబిలేసు, రమీజ, జయమ్మ, ప్రభావతి, సత్తెమయ్య, పెద్దన్న, నారాయణ, హోసూరప్ప, కేశవరెడ్డి, ఆదెమ్మ, శాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడొద్దు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసిన ఓబుళాపురం నాయకులు

బత్తలపల్లి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో టీడీపీ అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని, అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ ధర్మవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు అండగా తాను ఉంటానని ధైర్యం చెప్పారు. ఓబుళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బండి క్రిష్టప్పపై టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు. ఘటన గురించి బాధితుడు గ్రామానికి చెందిన నాయకులతో కలిసి బుధవారం ధర్మవరంలోని స్వగృహంలో కేతిరెడ్డిని కలిసి వివరించారు. పశువులను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే తాను పొరపాటున సీఎం చంద్రబాబు ఫొటోను వాట్సాప్‌ స్టేటస్‌గా పెట్టుకున్నట్లు అంగీకరించినప్పటికీ కేసు పెట్టారని తెలిపారు. కేతిరెడ్డి స్పందిస్తూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, భయపడవద్దని హామీ ఇచ్చారు. కేతిరెడ్డిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌, మాజీ మండల కన్వీనర్‌ బగ్గిరి బయపరెడ్డి, ఈడిగ కాశప్ప, ముసలప్ప, బోయపాటి సూర్యనారాయణ, నాయకులు బండి నాగభూషణ, బాల చెన్నప్ప, బండి ఆదినారాయణ, బాల సూర్యనారాయణ, మాలగుండ్ల శ్రీనివాసులు, బండి కేశవయ్య, తరుణ్‌ కుమార్‌, నాగేష్‌, పవన్‌కుమార్‌, రమేష్‌ తదితరులు ఉన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు అనంత, దుద్దుకుంట, కేతిరెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం గణికవారిపల్లిలో బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సోదరుడు శ్రీనివాసరెడ్డిల గృహప్రవేశానికి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, , పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల సమన్వయకర్తలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



అనుబంధ విభాగాల నాయకులను సత్కరిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్‌: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అనుబంధ విభాగాల నేతలకు సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అనుబంధ ఎస్సీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శిగా అంజినప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎస్టీడీ నరసింహులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు బుధవారం పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎంపికైన వారిని మాజీ ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ తుంగా ఓబుళపతి, వైస్‌ చైర్మన్‌ తిప్పన్న, జిల్లా అధికార ప్రతినిధి ఫొటోసాయి, పార్టీ పట్టణ కన్వీనర్‌ రవినాయక్‌, మాజీ కన్వీనర్‌ మాధవరెడ్డి, నాయకులు నారాయణస్వామినాయక్‌, కేశప్పరామయ్య పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



కోర్టులో మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్వర్లు

ధర్మవరం అర్బన్‌: కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఒక మార్గమని సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్‌ సివిల్‌ జడ్జి నందిని తెలిపారు. పట్టణంలో బుధవారం 'మధ్యవర్తిత్వం.. దేశం కోసం' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జీలు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కరీం, ప్రధాన కార్యదర్శి డీఎల్‌ఎస్‌ మూర్తి, సీనియర్‌, జూనియర్‌ న్యాయవాదులు శంకర్‌రెడ్డి, బాలసుందరి, సుమలత, అబ్దుల్లా, బిల్లే రవీంద్ర, వెంకటేష్‌, ప్రసాద్‌, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంట మనుషులను నియమించండి

ధర్మవరం రూరల్‌: దర్శనమల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేయడానికి మనుషులను నియమించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఇటీవల ఏజెన్సీ నిర్వాహకులను తొలగించారని, వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో విద్యార్థులకు భోజనం వడ్డించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్‌ తెచ్చుకొని తింటున్నారన్నారు.

వాచ్‌మెన్‌పై దాడి

ధర్మవరం అర్బన్‌: అపార్ట్‌మెంట్‌ వాచ్‌మెన్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలను బాధితుడితో పాటు టూటౌన్‌ సీఐ రెడ్డప్ప మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుందరయ్యనగర్‌లోని మున్సిపల్‌ స్కూల్‌ వెనుక ఉన్న అపార్ట్‌మెంట్‌కు అంకే వెంకటేష్‌ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అపార్ట్‌మెంట్‌ పక్కనే మరో అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉన్న పోతురాజు బుధవారం ఉదయం వెంకటేష్‌తో టిఫిన్‌ తెప్పించుకున్నాడు. పార్సిల్‌ అందుకున్నాక రూ.5వేలు దొంగతనం చేస్తావా అంటూ పోతురాజు తిడుతూ వెంకటేష్‌పై కట్టెతో దాడి చేశాడు. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో కుమారుడు వచ్చి వెంకటేష్‌ను కాపాడి, ఆస్పత్రిలో చేర్పించాడు. అనంతరం వాచ్‌మెన్‌ ఫిర్యాదు మేరకు పోతురాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

ఏటికి తరలిన పీర్లు



కోడేకండ్లలో అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న పీర్లస్వాములు

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల, విశ్వనాథపురం గ్రామాల్లో బుధవారం పీర్లస్వాములను ఏటికి తరలించారు. తొలుత ముజావర్లు ప్రత్యేక ఫాతెహా చేశారు. అనంతరం పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. కోడేకండ్లలో పీర్ల అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఎస్‌ఐ సోమశేఖర్‌ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సీపీఐ మండల కమిటీల ఏర్పాటు



కనగానపల్లిలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: సీపీఐ నూతన మండల కమిటీలను ఆ పార్టీ జిల్లా నేతలు ప్రకటించారు. బుధవారం కనగానపల్లిలో జరిగిన సీపీఐ 2వ మహాసభల్లో సీపీఐ జిల్లా అధ్యక్షుడు వేమయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కాటమయ్య, జిల్లా కార్యదర్శి మహదేవ్‌ తదితరులు కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల కమిటీలను ప్రకటించారు. చెన్నేకొత్తపల్లి మండల సహాయ కార్యదర్శిగా రాము, రైతు సంఘం కార్యదర్శిగా నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా అమర్నాథ్‌, నాగరాజు, నవీన్‌, ముత్యాలమ్మ, ఈశ్వరమ్మ, సుబ్బరాయుడు, ఉమాశంకర్‌, అశోక్‌ను ప్రకటించారు. అలాగే కనగానపల్లి కమిటీ కార్యదర్శిగా సీఎన్‌ కోట బాలరాజు, సహాయ కార్యదర్శిగా బాలకొండ మల్లికార్జునను ప్రకటించారు. అంతకుముందు కనగానపల్లి అంబేడ్కర్‌ సర్కిల్లో సీపీఐ జెండాను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఆర్టీటీ పాఠశాలలో పార్టీ కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి మండల కమిటీ నియామకం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేయవలసిన పోరాటాలపై చర్చించారు.

యువతి అదృశ్యం



జయంతి

పుట్టపర్తి టౌన్‌: పుట్టపర్తి మున్సిపాలిటీ కర్ణాటక నాగేపల్లికి చెందిన జయంతి అనే యవతి అదృశ్యమైంది. రెండు రోజుల క్రితం ఎంబీఏ పరీక్ష రాయడానికి అనంతపురం వెళ్లింది. పరీక్ష రాసిన తర్వాత పుట్టపర్తి రావడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లిన జయంతి తర్వాత ఏమైందో తెలియరాలేదు. ఎన్నిచోట్ల వెదికినా కనిపించకపోవడంతో తండ్రి చెన్నక్రిష్ణ పుట్టపర్తి రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిపిన వారు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ –94407 96839కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఎన్‌ఎస్‌గేట్‌లో పోలీసు బందోబస్తు



ఎన్‌ఎస్‌గేట్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని ఎన్‌ఎస్‌గేట్‌లో పోలీసులు భారీగా మొహరించారు. రామగిరి వైపునకు వెళ్లే వాహనాలను తనిఖీలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రామగిరిలో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో తనిఖీలు నిలిపివేసి వెళ్లిపోయారు.

వేతనాలు వెంటనే చెల్లించండి

ముదిగుబ్బ: నీటి సరఫరా కార్మికులకు పెండింగ్‌ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు. వారం రోజులుగా విధులను బహిష్కరించి ముదిగుబ్బ పంప్‌హౌస్‌ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు సీపీఐ నాయకులు బుధవారం మద్దతు తెలియజేశారు. సీపీఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, వెంకటరాముడు తదితరులు మాట్లాడుతూ కార్మికులకు 10 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రస్తా సమస్య పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ముదిగుబ్బ: మర్తాడులో పొలాలకు వెళ్లే రస్తా సమస్య పరిష్కరించాలని రైతులు బుధవారం సీపీఐ నాయకులు తహసీల్దార్‌ నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. ఇందుకూరుకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి తమ గ్రామం మీదుగా పొలాలకు వెళ్లే ఈ రహదారిని గోపాల్‌ అనే రైతు ఆక్రమించుకొని దారికి అడ్డుగా రాళ్లను వేశాడన్నారు. స్కెచ్‌లో రహదారి ఉన్నా ఆ రైతు దౌర్జన్యంగా అడ్డుకుంటుండడంతో దాదాపు 250 ఎకరాలకు రస్తా లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రస్తా సమస్య పరిష్కరిస్తే వ్యవసాయ పనులు చేసుకుంటారని సీపీఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, రాధాకృష్ణ కోరారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్‌ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వంటగదిని పరిశీలిస్తున్న డాక్టర్‌ అలేఖ్య

నల్లచెరువు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్‌ అలేఖ్య సూచించారు. వైద్య ఆరోగ్యసిబ్బందితో కలిసి బుధవారం ఆమె కేజీబీవీని సందర్శించారు. పాఠశాల ఆవరణ, వంటగదిని పరిశీలంచారు. అనంతరం డాక్టర్‌ అలేఖ్య మాట్లాడుతూ విద్యార్థులకు తయారు చేసే ఆహారంలో తాజా కూరగాయలనే వాడాలన్నారు. విద్యార్థులు జబ్బు చేస్తే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా దోమతెర వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, ఎస్‌ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తీర్చేవరకు ఉద్యమం

ధర్మవరం: మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ కార్మికుల సమస్యలు తీర్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సీఐటీయూ మండల కోకన్వీనర్‌ ఆయుబ్‌ఖాన్‌ తెలిపారు. మున్సిపల్‌ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్షలకు బుధవారం మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ రెగ్యులర్‌ కార్మికులు, మున్సిపల్‌ పారిశుధ్య కార్మికుల కమిటీలు సంపూర్ణ మద్దతు తెలిపారు. అయుబ్‌ఖాన్‌ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌ కార్మికులకు జీఓ 36 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్‌ రెగ్యులర్‌ కార్మిక సంఘం నాయకులు ఓబుళపతి, లింగరాజు, చిన్నూరు హరి, రామంజనేయులు, బొగ్గు నాగరాజు, జయకృష్ణ, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు బాబు, ఆది, వెంకటరాముడు, చెన్నకేశవులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ధర్మవరం రూరల్‌: పట్టణంలోని కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ ఎరువుల దుకాణాన్ని బుధవారం మండల వ్యవసాయాధికారి ఎస్‌.ఎం.ముస్తఫా తనిఖీ చేశారు. అనుమతులు లేని క్రియాజన్‌ అగ్రీ అండ్‌ బయోటెక్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌కు సంబంధించిన రూ.1,54,354 విలువ చేసే 142 బస్తాల ఎఫ్‌20 ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. అదే విధంగా ఐదు రకాల ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపారు. స్టాకు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు.